ఆధ్యాత్మిక సందడి

- వైభవంగా నీలమ్మ వేపచెట్టు అమ్మవారి తొలేళ్లు
- అమ్మవారికి విశేష అభిషేకాలు, తిరువీధి


నీలమ్మ వేపచెట్టు అమ్మవారి ఉత్సవ విగ్రహం తిరువీధోత్సవంలో భక్తులు


అమ్మవారికి సారె ఊరేగింపుగా తీసుకొచ్చిన మహిళలు, భక్తులు

అల్లిపురం: అస్సాం గార్డెన్స్‌లో వెలసిన భక్తుల కొంగు బంగారం శ్రీనీలమ్మ వేపచెట్టు అమ్మవారి శివరాత్రి వార్షిక జాతర సందర్భంగా మంగళవారం తొలేళ్ల ఉత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకుడు జోగారావు శర్మ ఆధ్వర్యంలో పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి భక్తులు భారీ ఎత్తున సారె తీసుకొచ్చి సమర్పించారు. సారె తిరువీధి ఉత్సవం అల్లిపురం బంగారమ్మమెట్ట, వెంకటేశ్వరమెట్ట, అస్సాం గార్డెన్స్ తదితర ప్రాంతాల మీదుగా ఆలయానికి చేరుకుంది.


నీలమ్మ వేపచెట్టు అమ్మవారు

ఘనంగా అమ్మవారి తిరువీధి

అమ్మవారి ఉత్సవ విగ్రహం తిరువీధోత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని పల్లకీలో అలంకరించి పూజలు చేసిన తర్వాత మహిళలు పల్లకి మోస్తూ తిరువీధి చేపట్టారు. ఈ సందర్భంగా మహిళల కోలాటం ఆకట్టుకుంది. అమ్మవారి మాలధారులు భక్తిశ్రద్ధలతో అగ్నిగుండం నిర్వహించారు. భక్తులు నీలమ్మ అమ్మవారి నామస్మరణతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. తిరువీధి ఉత్సవంలో 33వ వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన చిన్నారుల నృత్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

నేడు ప్రధాన పండగ

నీలమ్మ వేపచెట్టు అమ్మవారి ప్రధాన పండగ బుధవారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శనివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి జీవీ రమాబాయి తెలిపారు. సాయంత్రం ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఘనంగా దుర్గాలమ్మ తొలేళ్ల ఉత్సవం


దుర్గాలమ్మ అమ్మవారు

దాబాగార్డెన్స్: నగరంలోని పూర్ణామార్కెట్ వెలంపేటలో వెలసిన దుర్గాలమ్మ వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా మంగళవారం తొలేళ్ల ఉత్సవం అత్యంత ఘనంగా నిర్వహించారు. దుర్గాలమ్మకు విశేష పూజలు, ప్రత్యేక అర్చనలు జరిపారు. సాయంత్రం వెలంపేట, ప్రసాద్‌గార్డెన్స్, పండా వీధి, కల్లుపాకలు, పెరికివీధి తదితర ప్రాంతాల్లో అమ్మవారి ఉత్సవ విగ్రహంతో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అష్టలక్ష్మిలు, పులివేషాలు, తప్పెటగుళ్ల, తీన్‌మార్ దప్పులతో పరిసర ప్రాంతమంతా సందడిగా మారింది. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.


కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న భవానీ మాలధారులు, భక్తులు


విద్యుత్ వెలుగుల్లో అమ్మవారి దేవస్థానం


తీన్మార్ కళాకారుల సందడి

క్లుప్తంగా

కాంట్రాక్టర్స్ పరిస్థితిపై చర్చ


సమావేశంలో అసోసియేషన్ సభ్యులు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అడ్‌హక్ కమిటీ మంగళవారం సమావేశమైంది. జీవీఎంసీ ప్రాంగణంలో గల అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆర్థిక స్థితిగతులు, కాంట్రాక్టర్ల పరిస్థితి, త్వరలో జరగబోవు నూతన కమిటీ ఎన్నిక విధివిధానాలు, బైలాపై చర్చించారు. సమావేశంలో అడ్‌హక్ కమిటీ సభ్యులు గొంప చంద్రమౌళి, రంధి సాధూరావు, రాజాన వెంకట్రావు, టి.వీరారెడ్డి, కోడూరు నారాయణరావు, నెక్కంటి సత్యనారాయణ, మద్దాల రమేష్, షేక్ శిలార్, పిల్లా సూరిబాబు, జి.వీ రభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యంతో ఉద్యోగావకాశాలు


కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌ను సత్కరిస్తున్న ఏవీఎన్ కళాశాల యాజమాన్యం

దాబాగార్డెన్స్: నైపుణ్యంతో ఉద్యోగావకాశాలు లభిస్తాయని ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అన్నారు. యాటిట్యూడ్ స్కిల్స్, నాలెడ్జ్ (ఏఎస్‌కే) కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఏవీఎన్ పాలిటెక్నిక్ కళాశాల 'ఏవీఐఏఎన్-2024-25 ఫెస్ట్' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్లేస్‌మెంట్స్‌కు సంబంధించిన సూచనలిచ్చారు. కళాశాల కరస్పాండెంట్ ఏవీ అదీప్ భానోజీరావు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమ కన్వీనర్, ఏవీఎన్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ టి.వి.మురళి మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు వృద్ధి చేసుకోవాలన్నారు. కళాశాల ఫ్రెషర్స్ అండ్ ఫేర్‌వెల్ ఫెస్ట్‌లో భాగంగా సాంస్కృతిక ప్రదర్శనలు, క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రముఖుల చేతుల మీదుగా బహుమతులు, సర్టిఫికెట్స్ అందజేశారు. ఏయూ ఫిజిక్స్ విభాగాధిపతి ఎస్. శ్రీనివాసరావు, పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు, విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీవోడబ్ల్యూల విలీన సభ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రగతి శీల మహిళా సంఘాల ప్రతినిధులు

సీతమ్మధార: మార్చి 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఒంగోలులో నిర్వహించనున్న రెండు ప్రగతిశీల మహిళా సంఘాల రాష్ట్ర స్థాయి విలీన సభను జయప్రదం చేయాలని పీవోడబ్ల్యూ జిల్లా కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద గోడపత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీకేఎస్ రోహిణి దేవి మీడియాతో మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వాన్ని కోరుకునే ప్రతీ మహిళ స్మరించుకోవాల్సిన రోజైన మార్చి 8న ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో రెండు పీవోడబ్ల్యూలు ఏకమవుతాయన్నారు. పోరాటాల ద్వారానే హక్కులు సంక్రమిస్తాయన్నారు. జిల్లాలోని మహిళలందరూ ఒంగోలులో జరగనున్న రాష్ట్ర స్థాయి విలీన సభను జయప్రదం చేయాలని రోహిణి కోరారు. అదేవిధంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పౌర గ్రంథాలయంలో జిల్లా స్థాయి సభ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలోఏ పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, జిల్లా ఆఫీసు బేరర్ బాలనాగమ్మ, కార్యవర్గ సభ్యులు ఈసర లక్ష్మి, జయమ్మ పాల్గొన్నారు.

నాలుగేళ్ల తర్వాత తల్లి చెంతకు


తల్లి కృష్ణాబాయ్‌తో వాసుదేవ్

సీతమ్మధార: మానసిక వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి ఏయూటీడీ సిబ్బంది చికిత్స అందించి తల్లి చెంతకు చేర్చారు. నాలుగేళ్ల తర్వాత తల్లీకుమారుడు కలుసుకున్నారు. మహారాష్ట్రలోని హింగోళి జిల్లా పరిధి గోరెగావ్ గ్రామానికి చెందిన వాసుదేవ్ మానసిక వ్యాధితో బాధపడడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. అనంతరం ఇంటి నుంచి వచ్చేసిన వాసుదేవ్ కొన్నాళ్లు వేర్వేరు ప్రాంతాల్లో తిరిగి గత ఏడాది అక్టోబర్ 5న విశాఖ చేరుకున్నాడు. అక్కడి జ్ఞానాపురం రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తుండడంతో ఏయూటీడీ సిబ్బంది గుర్తించి టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని షెల్టర్ హోమ్‌కు తరలించారు. అనంతరం ఏయూటీడీ, శ్రద్ధ ఫౌండేషన్ సభ్యులు చికిత్స అందించారు. కోలుకున్నాక వాసుదేవ్‌ను స్వగ్రామం తీసుకెళ్లి తల్లి కృష్ణాబాయ్‌కు అప్పగించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. నాలుగేళ్ల తర్వాత కొడుకుని చూసిన ఆమె చాలా సంతోషించిందని తెలిపారు.

ప్రజల పక్షాన పోరాటం చేద్దాం

మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి


సమావేశంలో మాట్లాడుతున్న వాసుపల్లి

దాబాగార్డెన్స్: ప్రజలకు అండగా ఉంటూ, వారి పక్షాన పోరాటం చేద్దామని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ పేర్కొన్నారు. నియోజకవర్గ పార్టీ నాయకులతో పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియాకు అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి సూచనల మేరకు రాజకీయపర అంశాల పట్ల ప్రజల పక్షాన న్యాయ పోరాటం చేయాలన్నారు. అధికారంలోకి వచ్చిన ఏ పార్టీ అయినా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి, కానీ కూటమి ప్రభుత్వంలో వైఎస్సార్‌సీపీపై కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నారని వాసుపల్లి ఆరోపించారు. ఎవరైనా కూటమి నేతల వల్ల వైఎస్సార్ సీపీ నాయకులకు ఇబ్బంది కలిగితే వారిని సోషల్ మీడియా ద్వారా అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఇప్పటి వరకు వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ఎంతో ప్రతిష్టాత్మకంగా సేవలందించడంపై కృతజ్ఞతలు తెలిపారు. దక్షిణ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేసేలా నాయకులు కృషి చేయాలన్నారు. ప్రజలకు అండగా ఉంటూ, కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు ఎండగట్టే విధంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో పార్టీ విశాఖ జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి రామానంద్, పార్టీ కార్యదర్శి గురజాపు రవి, బీసీ సెల్ అధ్యక్షుడు సనపల రవీంద్రభరత్, పలు వార్డుల నాయకులు పీతల వాసు, దశమంతుల మాణిక్యాలరావు, దక్షిణ నియోజకవర్గ పార్టీ ఆర్‌టీఐ అధ్యక్షుడు దొడ్డి బాపూ ఆనంద్, ముత్తాబత్తుల రమేష్, అలపున కనకారెడ్డి, భీశెట్టి ప్రసాద్, సోషల్ మీడియా అధ్యక్షుడు బెవర మహేష్, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు సూర్య నాయుడు, వెలగని శేషగిరిరావు, ఆరుగుల రాజు, చింతకాయల వాసు, రాంరాజు తదితరులు పాల్గొన్నారు.

ధర్మ పరిరక్షణకు ప్రతిరూపం పరమశివుడు

దాబాగార్డెన్స్: ధర్మ పరిరక్షణకు ప్రతిరూపం పరమశివుడేనని, రుద్రభూమిలో ప్రత్యక్ష మైనప్పటికీ నిస్వార్థంగా లోకానికి వెలుగులు పంచేది కూడా ఆయనేనని విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం నేతృత్వంలో మంగళవారం దాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మహాశివరాత్రి వేడుకలు, శివ జయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. నిస్వార్థ సేవలకు ప్రతిరూపం శివుడేనన్నారు. పరమ శివుడిని సేవా భావంతో స్మరించుకుంటే విజయాలు లభిస్తాయన్నారు. కార్యక్రమ నిర్వాహకురాలు బీకే రామేశ్వరి మాట్లాడుతూ మహా శివరాత్రి పర్వదినం లోకానికి అత్యంత పుణ్యప్రదంగా నిలుస్తుందన్నారు. శివుడిని పూజించే భక్తులందరికీ పాపాల నుంచి విముక్తి కల్పించడమే కాకుండా, మంచి జీవితాన్ని ప్రసాదించే మహిమ గల స్వామిగా అభివర్ణించారు. కార్యక్రమంలో గంట్ల శ్రీనుబాబు, ఆర్.నాగరాజ్ పట్నాయక్, పలువురు బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు రూ.3.50 లక్షలు అందజేత

అల్లిపురం: నగర పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రోడ్డు ప్రమాద బాధితుల సహాయ కేంద్రం ద్వారా బాధితులకు పరిహారం అందేవరకు అవసరమైన సహాయం అందజేస్తామని నగర పోలీస్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సహాయ కేంద్రం ద్వారా తీసుకున్న చర్యల్లో భాగంగా ఇటీవల హిట్ అండ్ రన్ ప్రమాదాల్లో చనిపోయిన గొల్లవిల్లి అప్పారావుకు రూ.2 లక్షలు, తీవ్ర గాయాలపాలైన యస్.వీర్రాజు, సీహెచ్.కామేశ్వర్‌సాయి, నీలి రాజులకు ఒక్కొక్కరికి రూ.50 వేలు చొప్పున రూ.1.50 లక్షలు అందజేసి వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని ఆయన తెలిపారు.

పల్సస్ ఉద్యోగులకు తక్షణమే జీతాలివ్వాలి

దాబాగార్డెన్స్: రుషికొండ ఐటీ సెజ్‌లోని పల్సస్ హెల్త్ టెక్ సంస్థలో పనిచేస్తున్న ఐటీ ఉద్యోగులకు బకాయి పడ్డ 4 నెలల జీతాలు వెంటనే చెల్లించాలని సిటూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ ప్రకటనలో తెలిపారు. ఎంతో నైపుణ్యం గల సాఫ్ట్‌వేర్ ఉద్యోగస్తులతో అతి తక్కువ జీతాలతో పని చేయించుకుంటూ, ప్రతి నెలా జీతాలు చెల్లించకపోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. పల్సస్ యాజమాన్యం జాబ్‌మేళా పేరిట ఐటీ విద్యార్థులను క్యాంపస్ సెలక్షన్ పేరిట ఎంపిక చేసి, వారికి జీతాలు ఇవ్వకుండా మోసం చేస్తోందన్నారు. ప్రభుత్వం నుంచి అనేక రాయితీలు పొందుతున్న పల్సస్ యాజమాన్యం కార్మికులకు జీతాలు చెల్లించకుండా వారితో వెట్టిచాకిరీ చేయించుకుంటుందని పేర్కొన్నారు. తక్షణమే ఉద్యోగస్తుల జీతాల్లో కోతలు ఆపాలని, పీఎఫ్ సక్రమంగా చెల్లించాలని, బకాయి పడ్డ 4 నెలల జీతాలు వెంటనే చెల్లించాలన్నారు. లేనిపక్షంలో ఉద్యోగులకు అండగా సిటూ పోరాడుతుందని తెలియజేశారు.

రెవెన్యూ వసూళ్లు వేగవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

జగదాంబ: ఆస్తి, నీటి పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలని జెడ్సీ ఎం.మల్లయ్యనాయుడు ఆదేశించారు. సూర్యాబాగ్ జోనల్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులకు, సెక్రటరీలకు, ట్యాక్స్ కలెక్టర్లకు మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వార్డుల్లోని సచివాలయాల పరిధిలో సెక్రటరీలు, ఆర్ఐలు సిబ్బంది నిర్ణయించిన టార్గెట్లను మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేయాలన్నారు. పాత బకాయిలు, మొండి బకాయిదారులకు నోటీసులు జారీ చేయాలని, అప్పటికీ చెల్లించని పక్షంలో ఆస్తి జప్తు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. పన్ను చెల్లింపులు చేసే వారి నుంచి చెక్‌లు తీసుకోకుండా డీడీలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్వోలు, ఆర్ఐలు తదితరులు పాల్గొన్నారు.

గెలిపిస్తే ఉపాధ్యాయుల సమస్యలపై గళమెత్తుతా

పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి


మాట్లాడుతున్న పీడీఎఫ్ అభ్యర్థి విజయగౌరి

దాబాగార్డెన్స్: ప్రభుత్వ విద్యారంగాన్ని రక్షించుకునేందుకు, ఉపాధ్యాయ సమస్యలపై గళమెత్తేందుకు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా తనను గెలిపించాలని పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి విజ్ఞప్తి చేశారు. డాబాగార్డెన్స్‌లో గల అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో పలువురు యూటీఎఫ్ ప్రతినిధులతో కలిసి మాట్లాడారు. శాసన మండలంటే పెద్దల సభని, అటువంటి సభలో పీడీఎఫ్ తరఫున గెలుపొంది, ఎమ్మెల్సీలుగా పనిచేస్తున్న అభ్యర్థులు ఎంతో హుందాతనంగా, రాజకీయాలకతీతంగా, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లు, కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తున్నారని తెలిపారు. జీవో 117ను రద్దు చేస్తామని ఎన్నికల్లో హామీనిచ్చిన తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ జీవో ఇప్పటికీ రద్దు చేయలేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక పాఠశాలల ఉనికి లేకుండా కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఇదే జరిగితే మరిన్ని పాఠశాలలు మూతపడతాయని, ఉపాధ్యాయుల పోస్టులు లేకుండా పోతాయని, ఫలితంగా ప్రభుత్వ విద్య అందని ద్రాక్ష అవుతుందన్నారు. ఉపాధ్యాయులు, అధ్యాపకుల సహకారంతో తాను ఎమ్మెల్సీగా విజయం సాధిస్తే జీవో 117 రద్దుకు పోరాటం చేస్తానని హామీనిచ్చారు. పవిత్రమైన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను కొన్ని రాజకీయ పార్టీలు కలుషితం చేశాయని, రాజకీయ పార్టీల జోక్యం ఈ ఎన్నికల్లో ఉండడం భావ్యం కాదన్నారు. సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.లక్ష్మీరాజా, దాసరి నాగేశ్వరరావు, చందోలు వేంకటేశ్వరరావు, వై.సుధాకరరావు తదితరులు పాల్గొన్నారు.

నిర్ణీత సమయంలో ధ్రువపత్రాలివ్వాలి

దాబాగార్డెన్స్: ప్రజలకు అందించే జనన, మరణ, కుల, వివాహ, ఆదాయ ధ్రువపత్రాలను ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులు నిర్ణీత సమయంలో జారీ చేయాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వెంకటశేషమ్మ పేర్కొన్నారు. జీవీఎంసీ జోన్-4 సూర్యాబాగ్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయా ధ్రువపత్రాల జారీ ప్రక్రియపై జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్రతో కలిసి మంగళవారం నిర్వహించిన సెన్సిటైజేషన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జనన, మరణ సర్టిఫికెట్లు జారీ చేసే విషయంలో డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో ప్రైవేట్ హాస్పిటల్ యాజమాన్యంతో 6 నెలలకోసారి సెన్సిటైజేషన్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ధ్రువపత్రాల జారీలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు.. అధికారులు, ఉద్యోగులకు సెన్సిటైజేషన్ కార్యక్రమాలు తరచుగా నిర్వహించాలని జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్రను ఆదేశించారు. కార్యక్రమంలో జోన్-1,2,3,7 జోనల్ కమిషనర్లు, సహాయ వైద్యాధికారులు, స్టాటిస్టికల్ ఆఫీసర్లు, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఎరుకుమాంబ ఆలయానికి శివరాత్రి శోభ

నేడు అభిషేకాలు నిలిపివేత


అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న అన్నపూర్ణ

సీతమ్మధార: దొండపర్తిలోని శ్రీ ఎరుకుమాంబ అమ్మవారి ఆలయంలో బుధవారం మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జీవీ రమాబాయి తెలిపారు. బుధవారం శివరాత్రి సందర్భంగా అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని, భక్తుల రద్దీ దృష్ట్యా పసుపు నీళ్ల అభిషేకాలు నిలిపివేస్తున్నామని తెలిపారు. భక్తులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. శివరాత్రి సందర్భంగా ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అమ్మవారికి కుంకుమ పూజలు చేశాక భక్తులకు దర్శనాలు కల్పిస్తామన్నారు. సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటల వరకు పురవీధుల్లో సాంస్కృతిక, నృత్య, వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మార్చి 6న గురువారం మారువారం పండగ సందర్భంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి మహా అన్నసమారాధన ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భక్తులు ఈ వేడుకల్లో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని రమాబాయి విజ్ఞప్తి చేశారు. దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ టి.అన్నపూర్ణ ఆలయాన్ని సందర్శించారు. శివరాత్రి కోసం చేసిన ఏర్పాట్లు పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సత్యనారాయణ రాజు, తదితరులు పాల్గొన్నారు.

కనక మహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన


అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.